సాక్షి
జగిత్యాల

మంగళవారం । 28 । మార్చి । 2023



వైభవంగా రథోత్సవం

గొల్లపల్లి : వెన్గుమట్ల – బొంకూర్ శివారు లోని శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది.



బోదకాలును అరికడదాం

జగిత్యాల: బోదకాలును అరికడదామని ఆరోగ్య మిషన్ ఏడీ నాగయ్య అన్నారు. మెడిక ల్ కాలేజీలో డాక్టర్లకు అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
37.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండ తీవ్రంగా ఉంటుంది.

కూలీలతో పని చేయించుకున్నప్పుడు వారి చెమట ఆరకముందే కష్టార్జితం చెల్లించాలి

– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6.32	బుధ 4.48

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

జగిత్యాలటౌన్: ప్రజావాణి ద్వారా అభాగ్యులు అర్జీల ద్వారా తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు మకరంద్, లత ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వివిధ సమస్యలపై 24 అర్జీలను అధికారులకు అందజేశారు. వీటిని స్వీకరించిన అదనపు కలెకర్లు.. అర్జీదారులతో నేరుగా మాట్లాడారు. సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



పనులు ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని నాలుగో వార్డు పరిధి బ్రాహ్మణవాడలో సోమవారం డ్రైనేజీ నిర్మాణాన్ని ప్రారంభించారు. పట్టణ అభివృద్ధికి మంత్రి ఈశ్వర్ ప్రత్యేక చొరవతో సీఎం కేసీఆర్ రూ.కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులు వెచ్చించి ప్రతీవార్డులోని సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా, జైన గ్రామంలోని గుల్లగూడెం, బోయవాడల్లో చేపట్టిన సీసీరోడ్డు పనులను జెడ్పీటీసీ బత్తిని అరుణ ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు కిరణ్మయి, జైన సర్పంచ్ మహేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, నాయకులు ప్రేమ్‌చందర్‌రావ్, గాజుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


ఖాతాల్లో నిధులు జమచేయండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: మంజూరైన బిల్లుల నగదును ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని టీఆర్టీఎఫ్ నాయకులు విన్నవించారు. ఈమేరకు సోమవారం డీటీవోకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ వేతన, మెడికల్ లీవ్, సరెండర్, మెడికల్ బిల్లులు, రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ ఎరియర్స్, సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలు, కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈనెల 31తో ముగుస్తున్నందున ఆ బిల్లులను వెంటనే ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో వెంటనే జమచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుంగూరి సురేశ్, శ్రీనివాస్‌గౌడ్, పవన్‌కుమార్, అంబాజీనాయక్, శేఖర్, హరీశ్, రాజన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్

రాయికల్(జగిత్యాల): ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలోని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వెకిలిచేష్టలపై 'టీచకుడు' శీర్షికన ఈనెల 17న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ యాస్మిన్ బాషా.. శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఉషారాణి ఉత్తర్వుల మేరకు ఇటిక్యాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీధర్‌ను నియమించారు.

విద్యార్థుల్లో దృష్టి లోపం

కనిపించని అక్షరాలు

- మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం కారణం
- కరోనా నేపథ్యంలో ఆన్‌లైన్ క్లాసుల ఫలితం
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ స్పందించాలంటున్న డాక్టర్లు
- చిన్నారులకూ 'కంటి వెలుగు' అమలు చేయాలని సూచన



కళ్లద్దాలు పెట్టుకుని తరగతులకు హాజరైన విద్యార్థులు

కథలాపూర్(వేములవాడ): కరోనా నేపథ్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా విద్యాబోధన చేశారు. ఇందుకోసం విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్ టీవీలు అధికంగా వీక్షించారు. ఇవి చిన్నారుల కళ్లపై తీవ్ర ప్రభావం చూపాయని వైద్యులు గుర్తించారు. ఫలితంగా దూరపు, దగ్గరిచూపు సమస్యలు ప్రస్తుతం తీవ్రస్థాయికి చేరాయంటున్నారు. కరోనా వైరస్ తగ్గుముఖం పట్టాక కళ్లద్దాలు పెట్టుకుని తరగతులకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, ఇది కంటిజబ్బుల తీవ్రతకు అద్దంపడుతోందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వివరిస్తున్నారు.

కంటి వెలుగు సమాచారం

18ఏళ్ల పైబడిన వారి సంఖ్య	6,60,000
నియమించిన కంటివెలుగు వైద్య బృందాలు	46
కంటి పరీక్షలు చేయించుకున్నవారి సంఖ్య	3,63,000
రీడింగ్ అద్దాలు తీసుకున్నవారు	51,139
దూరపు కళ్లద్దాలు అవసరమైవారు	60,965
దూరపు కళ్లద్దాలు తీసుకున్నవారు	35,146



బాలబాలికల్లో సమస్యలు అధికం..

- విద్యార్థుల్లో కంటి సమస్యలు ఎక్కువేనని, తల్లిదండ్రులకు దృష్టిలోపం గురించి చెప్పుకోలేకపోవడం, దృష్టిలోపమని గుర్తించకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది.
- కొందరు విద్యార్థులకు బ్లాక్ బోర్డుపై అక్షరాలు కనిపించకపోవడంతో చదువుల్లో వెనుకబడిపోతున్నారని పలువురు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కొన్ని విద్యా సంస్థల్లో తరగతికి కనీసం నలుగురు, ఐదుగురు విద్యార్థులు దృష్టిలోపంతో బాధపడుతున్నవారు ఉంటున్నారు.
- మరికొన్నింటిలో తరగతికి సుమారుగా పది మంది దృష్టిలోపంతో బాధపడుతున్నట్లు ఉపాధ్యాయులు అంటున్నారు.
- పౌష్టికాహార లోపంతోపాటు సెల్‌ఫోన్, టీవీలు, ల్యాప్‌టాప్‌లు ఎక్కువ సేపు వినియోగిస్తుండటంతో కంటి సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.
- పలు విద్యాసంస్థల్లో కొందరు విద్యార్థులు కళ్లద్దాలు లేకుండా పుస్తకాలు చదివే పరిస్థితులు లేవంటున్నారు.
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో కంటి పరీక్షలు చేయించుకుంటే మందులు, కళ్లద్దాల కోసం ఒక్కో విద్యార్థికి రూ.2వేల వరకు ఖర్చవుతోంది.

18 ఏళ్లలోపు విద్యార్థులు 1.60 లక్షల మంది..

- జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, సంక్షేమ హాస్టళ్లు 1,154 ఉండగా.. ఇందులో 1.45 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మరోవైపు జూనియర్ కళాశాలలు 71 ఉండగా 15,972 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా 18 ఏళ్ల లోపు వయసు ఉన్నవారే. అయితే, ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో వీరికి కంటి పరీక్షలు చేయడంలేదు. కంటి వెలుగు పోర్టల్‌ను 18 ఏళ్ల పైబడిన వారి వివరాలు నమోదయ్యేలా తయారు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో 18ఏళ్ల లోపు విద్యార్థులకు కంటి పరీక్షలు చేయలేని పరిస్థితి నెలకొందని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

ప్రైవేట్‌లో పరీక్ష చేయించుకున్న



తలనొప్పి, కంటి సమస్యలున్నాయని మా అమ్మానాన్నకు చెప్పిన. కోరుట్ల ప్రైవేట్ ఆస్పత్రిలో కంటి పరీక్ష చేయించిండ్రు. కళ్లద్దాలు అవసరమని డాక్టర్ చెప్పిండ్రు. కళ్లద్దాలు పెట్టుకుంటేనే బోర్డుపై రాసిన అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నయి. ఇప్పుడు చూపుసమస్య తీరింది.

– గజెల్లి విశ్వంభర్, పదో తరగతి, ఊట్‌పల్లి

తిరకాసు సరికాదు



ఆరోగ్య సమస్యలు ఏ వయస్సు వారికైనా ఉండొచ్చు. కంటి వెలుగు ద్వారా 18 ఏళ్లకు పైబడిన వారికే కంటి పరీక్షలు చేయడం సరికాదు. పిల్లలు, పెద్దలకు కంటి పరీక్షలు చేయాలి. అన్నివయసుల వారికి సకాలంలో కంటి సమస్యలు గుర్తించాలి. అప్పుడే అంధత్వ నివారణ సాధ్యం అవుతుంది.

– కర్క రాజేశ్, విద్యార్థి సంఘం నాయకుడు

ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు 18ఏళ్ల పైబడిన వారికి కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు చేస్తున్నాం. అవసరమైనవారికి కళ్లద్దాలు ఇస్తున్నాం. ఆపరేషన్లు అవసరమైనవారిని గుర్తించాం. 18 ఏళ్లలోపు వయస్సువారికి పరీక్షల విషయంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

జగిత్యాల: చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. స్థానిక ఎస్‌కేఎన్ఆర్ జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు సోమవారం రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మిల్లెట్స్‌తో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, దీనిని తీసుకోవాలని సూచించారు. ఈవిషయంపై అందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. సిబ్బంది స్వరూపరాణి, మానస పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి

జగిత్యాలరూరల్: కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి సూచించారు. పొరండ్లలో పోషణ్ పక్వాడ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రక్తహీనతపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. బాలికలు చిరుధాన్యాలు, బెల్లం, పల్లీలు, అలిసంతలు, శనగలు, కొర్రబియ్యం, జొన్నలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. వీటిని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, లక్ష్మి, కవిత, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు ప్రాతిపదికన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) 14 ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా సోమవారం తెలిపారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు చదివిన వారు ఈ పోస్టులకు అర్హులన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్‌ను జతచేసి ఈనెల 28 – ఏప్రిల్ 3వ తేదీ వరకు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు జగిత్యాల అధికారిక వెబ్‌సైట్ https://jagtial.telangana.gov.in/లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాహుల్ గొంతు నొక్కలేరు

- నిరసన దీక్షలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: మోదీ పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న వారిని వదిలి ప్రజల పక్షాన గళమెత్తిన రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, ఇది బీజేపీ నియంతృత్వ పాలనకు పరాకాష్ట అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దును నిరసిస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం సమీపంలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ భారత్‌జోడో యాత్రకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభించిందని, దీనిని జీర్ణించుకోలేని మోదీ ప్రభుత్వం రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసిందని విమర్శించారు. అదానీ బోగస్ కంపెనీల గురించి ప్రశ్నిస్తే కేంద్రప్రభుత్వానికి కోపం ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా బడా వ్యాపారులకు రూ.లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయడం బీజేపీ పెట్టుబడిదారీ అనుకూల వైఖరికి నిదర్శనమన్నారు. ప్రధానమంత్రి మోదీని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి, నాయకులు నాగభూషణం, మోహన్, దుర్గయ్య, శంకర్, రాజేందర్, అశోక్, మధు ఉన్నారు.

నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ గ్రామైక్య సంఘంలో రూ.14.50 లక్షల సొంతానికి వినియోగించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ యువచైతన్య యూత్ సభ్యులు సోమవారం జగిత్యాలలో కలెక్టర్ యాస్మిన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. గ్రామైక్య సంఘం పరిధిలో 15 మహిళా సంఘాలు ఉన్నాయని, ఇందులో 11 సంఘాల్లోని మహిళలు రూ. 2017–18లో స్త్రీనిధి ద్వారా రూ.14.50 లక్షల రుణం మంజూరైందని తెలిపారు. మహిళలు తమకు రుణం వద్దని తిరస్కరించారని, దీంతో రూ.14.50 లక్షలు మళ్లీ గ్రామైక్య సంఘంలో జమ చేశారని పేర్కొన్నారు. ఈ సొమ్మును కొందరు స్వాహా చేశారని, బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

అధ్యక్ష స్థానానికే ఎన్నికలు

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసింది. అధ్యక్ష స్థానం తప్ప మిగతా స్థానాలన్నీ ఏకగ్రీవమయ్యాయి. దీంతో అధ్యక్షస్థానానికే ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది. ఎర్ర నర్సయ్య, కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్ష స్థానం కోసం పోటీపడుతున్నారు. అధ్యక్ష స్థానం కోసం ఈనెల 31న పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఫలితాలు విడుదల చేస్తామని ఎన్నికల అధికారి టి.గంగాదరాప్రసాద్, సహాయ ఎన్నికల అధికారి ఎస్.సంజీవ్‌రెడ్డి తెలిపారు.

ఏకగ్రీవమైన వారు వీరే..

ప్రధాన కార్యదర్శిగా చీటి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శిగా అందె మారుతి, ఉపాధ్యక్షుడిగా సిరిపురం మహేంద్రనాథ్, మహిళా కార్యదర్శిగా పుప్పాల వనిత, గ్రంథాలయ కార్యదర్శిగా కర్నె హరిదాసు, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా పోట్టవత్తిని సతీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా గుడికందుల మహేశ్, అల్లె పురుషోత్తం, శ్రీరాం కరుణాకర్, నీరటి వెంకటేశ్, కొత్తపల్లి గంగారాజం, రాచకొండ విజయ్‌కృష్ణ, రాజేశుని జీవన్, కంచి సురేశ్, బొల్లె రమేశ్, ఎండీ సలీంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ప్రకటించారు.

కులవృత్తులకు అధిక ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- అపర భగీరథుడు సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని, కుల వృత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌అన్నారు. పట్టణంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, జగిత్యాల నియోజకవర్గంలో రూ.63 కోట్లతో 180 చెరువుల్లో పూడికతీశామన్నారు. చెక్‌డ్యామ్‌లు, కాళేశ్వరం, మిషన్ కాకతీయ ప్రాజెక్టుల ద్వారా ప్రతీ నీటిచుక్కను ఒడిసిపట్టి తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్నామని అన్నారు. రాయికల్ మండలంలో రూ.30 కోట్లతో చెక్‌డ్యామ్‌లు, బీర్‌పూర్‌లో రూ.140 కోట్లతో రోళ్లవాగు ఆధునికీకరణ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి దామోదర్, నాయకులు గట్టు సతీశ్, రాజ్‌కుమార్, అంజయ్య, పవన్, రాజు, రజినికాంత్, రాజేశ్, నవీన్, అశోక్, ఉపేందర్ పాల్గొన్నారు. అనంతరం తులసీనగర్‌లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. పట్టణాభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధిపనులు చేపడుతున్నామన్నారు. ప్రతీవార్డులో మంచినీటి సరఫరా, డ్రెయినేజీలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఆస్తిపన్ను వసూళ్లలో ఉమ్మడి జిల్లాలో జగిత్యాల వెనుకబడిందని, ప్రజలు సకాలంలో చెల్లించాలని కోరారు.

కొంచెం మోదం.. కొంచెం ఖేదం!

- ఎన్ఎంఆర్ వేతనాలు పెంచుతూ గెజిట్ జారీ
- రెండేళ్లకోసారి పెరుగుదల, తాజా సవరణతో 15శాతం పెంపు
- కరీంనగర్‌లో కనీస వేతనానికి దూరంగా కొందరు ఎన్ఎంఆర్‌లు
- రూ.425కు బదులుగా రోజుకు రూ.283 మాత్రమే చెల్లింపు
- సాక్షాత్తూ కరీంనగర్ కలెక్టరేట్ ప్రాంగణంలోనే అమలుకాని వైనం
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సంతృప్తికరంగానే వేతనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్)ల వేతనాలు పెంచుతూ కరీంనగర్ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి రెండేళ్లకోసారి వీరి వేతనాలను సవరిస్తూ ఉంటారు. కానీ, కరోనా కారణంగా 2020లో వీరికి వేతన సవరణ జరగలేదు. ఫలితంగా ఇప్పుడు 2020లతోపాటు 2022ను కలుపుకొని వేతనాలను 15శాతం పెంచుతూ గెజిట్ జారీ చేశారు. త్వరలోనే నూతన వేతనాలు అమలులోకి రానున్నాయి. అదే సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌లకు ఇంకా 2016కు ముందు ప్రకారమే వేతనాలు చెల్లిస్తుండటం గమనార్హం. మొత్తానికి వేతనాలు పెరిగినందుకు కొందరు సంతోషపడుతుండగా.. మరికొందరు మాత్రం ఇంకా తమ బతుకులు మారనందుకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్ జిల్లాలో ఇలా?

జిల్లాలో కలెక్టర్ కాంప్లెక్స్‌తోపాటు పలు ప్రభుత్వశాఖల్లో చిరుద్యోగులుగా పనిచేసే.. ఎన్ఎంఆర్‌ల స్థితి దయనీయంగా ఉంది. నెల మొత్తం బండెడు చాకిరీ చేసినా వారికి దక్కేది కేవలం రూ.8,500 మాత్రమే. అదికూడా 30రోజుల్లో ఒక్కరోజు కూడా ఆబ్సెంట్ లేకుండా ఉంటేనే. ఏ అవసరానికి సెలవుపెట్టినా వేతనంలో కోతలు తప్పవు. ఇలాంటి వారు దాదాపు కేవలం కరీంనగర్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో 30మందికి వరకు ఉన్నారు. వాస్తవానికి వీరికి కనీస వేతనాలు చెల్లించాలని 2016లో ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెలువడిన ప్రభుత్వ అధికారిక నిబంధనలు ఇప్పటికీ అమలు కాలేదు. ఫలితంగా జిల్లాలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌ల పరిస్థితి దయనీయంగా ఉంది. అడ్డా మీద కూలీల కంటే కూడా తమ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాని వారంతా వాపోతున్నారు. అయితే, ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేసే ఎన్ఎంఆర్‌లకు వేతనాలు గెజిట్ ప్రకారమే ఇస్తుండటం గమనార్హం.


15శాతం పెంచుతూ జీవో

తాత్కాలిక పద్ధతిన వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులుగా వీరిని రిక్రూట్ చేసుకున్నారు. వాస్తవానికి వివిధ శాఖలు వారికి అవసరమైన మేరకు రోజువారీ పద్ధతిన పనిచేసే ఎన్ఎంఆర్‌ల వేతనాలు చెల్లించాలి. ఈ అందరికీ చివరిసారిగా 2018లో వేతనాలు పెరిగాయి. అనంతరం కరోనా కారణంగా ఈ పెంపుదల జరగలేదు. తాజాగా వీరి వేతనాలను 15శాతం మేరకుపెంచుతూ కలెక్టర్ కర్ణన్ గెజిట్ జారీ చేశారు. చేసే పని, ప్రావీణ్యం ఆధారంగా వీరిని అన్‌స్కిల్డ్ (చౌకీదార్, అటెండర్, స్వీపర్, మేస్త్రీ, మజ్దూర్, స్కావెంజర్ తదితరాలు) సెమీ స్కిల్డ్ (సెకండ్ క్లాస్ మేషన్, కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, పెయింటర్, ఫిట్టర్, కుక్, ఎలక్ట్రీషియన్, తదితరాలు) స్కిల్డ్ (ఫస్ట్‌క్లాస్ మేషన్, మెకానిక్,ఫిట్టర్, వెల్డర్, డ్రైవర్, క్లర్క్స్, టైపిస్ట్ తదితరాలు) అనే మూడురకాలుగా వర్గీకరించారు. ఇవే ఆదేశాలు కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు వర్తించనున్నాయని అధికారులు తెలిపారు.



కార్మికులు

ఆ 30 మందికి అమలు చేయాలి



ప్రస్తుతం కరీంనగర్ కలెక్టరేట్‌లో దాదాపు 30 మంది 15 ఏళ్లుగా ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. కాకుండా కేవలం రూ.8,500 నామమాత్రపు వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ విషయం సమాచారహక్కు చట్టం ద్వారా వెల్లడైంది కూడా. వారంతా నోరు తెరిచి అడగలేని దయనీయ స్థితిలో ఉన్నారు. ఎన్ఎంఆర్‌లకు తాజాగా 15శాతం వేతన సవరణను ఆహ్వానిస్తున్నాం. కానీ, వీరి విషయంలో మానవతా దృక్పథంతో అందరికీ కొత్త వేతన సవరణ ప్రకారం జీతాలు అందజేయాలి.

– మహమ్మద్ జమీల్, సామాజిక కార్యకర్త

కేటగిరీ	2018 ప్రకారం వేతనాలు	
	నాన్ కార్పొరేషన్	కార్పొరేషన్
అన్‌స్కిల్డ్	రూ.425	రూ.531
సెమీ స్కిల్డ్	రూ.480	రూ.600
స్కిల్డ్	రూ.540	రూ.675
కేటగిరీ 2022 ప్రకారం వేతనాలు		
	నాన్ కార్పొరేషన్	కార్పొరేషన్
అన్‌స్కిల్డ్	రూ.489	రూ.611
సెమీ స్కిల్డ్	రూ.552	రూ.690
స్కిల్డ్	రూ.621	రూ.776

(నోట్: ఈ పెంపుదల 2019–2020, 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు వర్తిస్తుంది)

క్లుప్తంగా

చేపపిల్లల ఉత్పత్తి స్థానికులకే ఇవ్వాలి

జగిత్యాల టౌన్: చెరువులు, కుంటలపై మత్స్యకారులకే హక్కు ఉండాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో నిర్మించిన మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కుంటలు, చెరువులపై మత్స్య కార్మికులకే అధికారం ఉంటుందన్నారు. మత్స్యకారులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా జగిత్యాల కొత్త బస్టాండ్‌లో చేపల మార్కెట్ ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. కులవృత్తులకు అండగా ఉంటానని ఆయన హామీఇచ్చారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గుమ్ముల అంజయ్య సభ్యులు తోపారపు రజనికాంత్, జుంబర్తి శంకర్, పల్లికొండ రాజు, బింగి రవి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

రేచపల్లిలో ఎమ్మెల్యే పల్లెనిద్ర



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: మీరు నేను కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సోమవారం రేచపల్లిలో పల్లెనిద్ర చేశారు. ఆంజనేయ స్వామి ప్రతిష్టాపనోత్సవాల్లో పాల్గొన్న అనంతరం గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమం, గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సాగునీరు, విద్యా, వైద్యంపై దృష్టిసారించిందన్నారు. మంగళవారం రేచపల్లి, మ్యాడారం తండా, లచ్చనాయక్ తండా, భీంరెడ్డి గూడెం గ్రామాల్లో పర్యటించనున్నారు. ఇక్కడ ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్ రెడ్డి, సర్పంచ్ ఎడమల జయ, ఎంపీటీసీ భూక్య లావణ్య రాథోడ్, ఉప సర్పంచ్ రాచకొండ రాజేశం, నాయకులు, కార్యకర్తలున్నారు.

తనిఖీ

జగిత్యాల టౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఓ మహిళ కత్తితో వచ్చిందనే సమాచారంతో పోలీసులు ఆమెను తనిఖీ చేశారు. కార్యాలయం ఎదుట ఆమె బ్యాగును తనిఖీ చేయగా ఎలాంటి ఆయుధం లభించలేదు. ఆమెను విచారించగా మతిస్థిమితం కోల్పోయినట్లు గుర్తించారు. అనంతరం ఆమెను బయటకు పంపించేశారు.

పరిశోధనా ఫలాలు రైతులకు చేరాలి

- సాగు సమస్యలపై రెండ్రోజులు సదస్సు
- పాల్గొననున్న ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల శాస్త్రవేత్తలు



పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం

జగిత్యాల అగ్రికల్చర్ : వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి పరిశోధనలు చేస్తూ అత్యుత్తమ విత్తనాలు తయారు చేసినప్పటికీ పరిశోధనా ఫలాలు పలు కారణాలతో రైతుల చెంతకు చేరడం లేదు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సమన్వయంతో సాగులో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉన్నా జరగడం లేదు. ఈ నేపథ్యంలో సాగులో సమస్యలపై చర్చించేందుకు ఉత్తర తెలంగాణ జోనల్‌స్థాయి శాస్త్రవేత్తల సదస్సు పొలాస పరిశోధన స్థానంలో మంగళవారం ప్రారంభం కానుంది. రెండ్రోజుల పాటు సదస్సు జరగనుండగా, కలెక్టర్ యాస్మిన్ బాషా, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొననున్నారు.

మూడు ఉమ్మడి జిల్లాలకు..

పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం ఉమ్మడి జిల్లాలైన కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు కేంద్రం. ఈ కేంద్రం పరిధిలోనే ఆయా జిల్లాల్లోని వ్యవసాయ పరిశోధనా స్థానాలు, డాట్ సెంటర్లు, కృషి విజ్ఞాన కేంద్రాలు పనిచేస్తాయి. వీటిలో దాదాపు 60–70 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు పనిచేస్తుంటారు. పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానంలో వరి, వేరుశెనగ, నువ్వులు, పంటలసాగు విధానాలు, సాగునీటి యాజమాన్యంపై పరిశోధనలు చేస్తారు. పరిశోధనా ఫలాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలిపేందుకు శాస్త్రవేత్తలు ఆసక్తి చూపడం లేదు. ప్రతి సీజన్‌లో తమ పరిశోధన స్థానాల్లో సాగుచేసిన పంటలను తిలకించేలా ప్రదర్శన క్షేత్రాలు, సాగు సమస్యలు తెలుసుకునేలా కిసాన్ మేళాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా నిధుల కొరతతో ఎప్పుడోసారి మమా అనిపిస్తున్నారు.

సమన్వయం అంతంతే..

జిల్లాలోని అయా మండలాల్లో పనిచేసే వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల మధ్య సమన్వయం లోపిస్తుంది. ప్రతి సీజన్‌లో నెలకోసారి ఉండే సమావేశాలు సైతం కన్పించడం లేదు. రైతులకు సాగులో సమస్యలు, సందేహాలు వచ్చినప్పుడు ఎక్కడకి వెళ్లాలో తెలియడం లేదు. క్షేత్రస్థాయిలో రైతులు పొలాలను సందర్శించేందుకు వెళ్లినప్పుడు, ఆ సమయంలో వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండటం లేదు. వ్యవసాయాధికారులు ఏదైనా సమస్యపై శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లినా సకాలంలో క్షేత్ర సందర్శనకు రావడం లేదనే ఆరోపణలున్నాయి. ఏదైనా సమస్య వచ్చినప్పుడు రైతులే అధికారులు, శాస్త్రవేత్తల చుట్టూ తిరగడం ఇష్టం లేక పురుగుమందుల దుకాణాలను ఆశ్రయించి, వారు ఇచ్చిన మందులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

మూస ధోరణిలో పరిశోధనలు

శాస్త్రవేత్తలు రూపొందించిన విత్తనాలను రైతులు ఆదరిస్తుంటే, కొన్ని రకాల విత్తనాల సంగతి రైతులకు తెలియని పరిస్థితి. మూస ధోరణిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశోధనలు చేస్తున్నారు. దీంతో పరిశోధనలను రైతులు పెద్దగా ఆదరించడం లేదు. రైతులు ప్రధానంగా కూలీలు, మార్కెటింగ్ సమస్యను ఎదుర్కొంటున్నారు, వాతావరణ మార్పులతో తెగుళ్లు, చీడపీడలు వంటి సమస్యలు ఎక్కువవుతున్నాయి. అధిక దిగుబడినిచ్చే విత్తనాల కోసం రైతులు వెతుకుతున్నారు. ప్రైవేట్ విత్తన కంపెనీలు రకరకాల పేర్లతో విత్తనాలు తయారు చేసి రైతులకు విక్రయిస్తుండగా నిధుల కొరతతో అనుకున్న స్థాయిలో పరిశోధనా స్థానాల్లో విత్తనోత్పత్తి జరగడం లేదు.

అవసరమైన పరిశోధనలు చేయాలి



శాస్త్రవేత్తలు మూస ధోరణిలో కాకుండా రైతులకు అవసరమైన పరిశోధనలు చేసి రైతుల అభిమానాన్ని చూరగొనాలి. వరిపంటకు ప్రత్యామ్నాయ పంటలపై, కోతుల సమస్యపై ప్రధానంగా దృష్టిసారించాలి. వాతావరణ మార్పులు రైతులకు సమస్యగా మారింది. వాటిపై పరిశోధనలు చేయాలి.

– సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉత్తమ రైతు, నాగారం, ధర్మపురి మండలం

సాగులో సమస్యలు చర్చించేందుకే..



రైతులు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకే ఉత్తర తెలంగాణ జోనల్ స్థాయి శాస్త్రవేత్తల సమావేశాలు రెండ్రోజులు పాటు పొలాసలో నిర్వహిస్తున్నాం. గత సీజన్లలో సాగులో ఏర్పడ్డ ఇబ్బందులు, వచ్చే సీజన్‌లో చేపట్టాల్సిన పద్ధతులపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్,పొలాసవ్యవసాయ పరిశోధనా స్థానం

‘ఆయుష్మాన్ భారత్’తో కార్పొరేట్ వైద్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ రావు



నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ రావు

రాయికల్: ప్రధానమంత్రి మోడీ ప్రజల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్ భారత్‌తో రూ.5 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం అందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ నియోజకవర్గ నాయకుడు, బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ ఉచిత దరఖాస్తుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయుష్మాన్ భారత్‌తో రూ.5లక్షల వరకు కార్పొరేట్ వైద్యం అందుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పడాల తిరుపతి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ఎంపీటీసీ ఆకుల మహేశ్, నాయకులు మచ్చ నారాయణ, ఉడుత రవీందర్, కుంభోజి రవి, మోసారపు శ్రీకాంత్, తోపారపు రవి, మల్లారెడ్డి, లక్ష్మణ్, శంకర్, సంజీవ్, సతీశ్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం : ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మొద్దని, సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం మండలకేంద్రం శివారులోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ బీజేపీ పార్టీ నాయకుల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వేలకోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారని, కానీ రూ. వెయ్యి కోట్లతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. మండలంలో 10,039 మంది రైతులకు రూ.107 కోట్లు రైతుబంధు కింద అందజేస్తున్నట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1545 మంది లబ్ధిదారులకు సుమారు రూ.13కోట్ల 90 లక్షలు, పింఛన్ల ద్వారా 10,767 మంది లబ్ధిదారులకు నెలకు రూ.2కోట్ల 31 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ముందుగా ఇబ్రహీంపట్నం నుంచి కల్యాణ మండపం వరకు బీఆర్ఎస్ నాయకులు భారీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సమావేశంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు డాక్టర్ సంజయ్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకటి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నేమూరి లత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నేమూరి సత్యనారాయణ, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

దేవుడే కరుణించాలి!

- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో అర్చకులు



చింతకుంట తారకేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో ధూపదీప నైవేద్యం పథకం కింద దేవుళ్లకు నిత్యపూజలు చేస్తున్న అర్చకులకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోంది. అసలే తక్కువ వేతనాలు.. నెలల తరబడి జాప్యం కావడంతో అర్చకుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

జిల్లాలో 220 ఆలయాలు..

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు, 380 గ్రామాలు ఉన్నాయి.
- గ్రామాలు, పట్టణాల్లో ఆదాయ మార్గాలు లేనిఆలయాలకు వచ్చే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా నిత్య పూజల కోసం ప్రభుత్వం ధూపదీప నైవేద్యం పథకం ప్రవేశపెట్టింది.
- ఈ పథకం కింద జిల్లాలో 220 ఆలయాలను ఎంపికచేశారు.
- కానీ 189 ఆలయాల్లోని అర్చకులకు ఈ పథకం ద్వారా వేతనాలు అందుతున్నట్లు తెలిసింది.

అరకొర వేతనం.. ఆపై పెండింగ్

ధూపదీప నైవేద్యం పథకం కింద ఒక్కో ఆలయానికి నెలకు రూ.6 వేలు కేటాయిస్తున్నారు. ఇందులో రూ.2 వేలు ధూపదీప నైవేద్యం కోసం, రూ.4 వేలు అర్చకులకు వేతనాలు చెల్లించాలని నిర్ణయించారు. ఈ వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని అర్చకులు వాపోతున్నారు. పూజలకు అవసరమైన సామగ్రి ధరలు పెరిగిన దృష్ట్యా రూ.2వేలు సరిపోవడంలేదని అంటున్నారు. అంతేకాదు.. రూ.4వేల వేతనంతో కుటుంబాన్ని పోషించుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

నివేదిక పంపిస్తున్నాం

అర్చకుల హాజరు నివేదికను ప్రతినెలా ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. అంతవరకే మా పరిధి ఉంటుంది. వేతనాలు దేవాదా య శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి నే రుగా అర్చకుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతాయి. వేతన సమస్యను ఉ న్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– చంద్రశేఖర్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, కరీంనగర్

ప్రతినెలా వేతనాలు చెల్లించాలి



ధూపదీప నైవేద్య పథకం కింద రూ.6 వేలతో ఆలయాల నిర్వహణ కష్టం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతీ వస్తువు ధర పెరిగింది. రూ.2వేలతో నూనె, వత్తులు, అగరబత్తులు, ఇతర సామగ్రి నెలకు సరిపడేలా కొనుగోలు చేయలేకపోతున్నాం. అర్చకులకు ఇచ్చే రూ.4వేలతో కుటుంబాన్ని పోషించడం భారమే. కుటుంబావసరాలు తీర్చేలా కనీసం రూ.10వేల వేతనం చెల్లించాలి. ఇదికూడా ప్రతినెలా మంజూరు చేయాలి.

– ఓరుగంటి మాధవాచార్యులు, ధూపదీప నైవేద్య పథకం అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇబ్బంది పెట్టొద్దు



ఆలయాల్లో అర్చకులు నిత్య పూజలు చేస్తున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారు. అలాంటి అర్చకుల వేతనాలను ప్రతినెలా అందించకపోవడం దారుణం. ఇప్పటిపరిస్థితులకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలి. ప్రతీరోజు రూ.500 ఉండేలా ఉత్తర్వులు జారీచేయాలి.

– తుమ్మనపెల్లి మహేశ్, బీజేపీ నాయకుడు

రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ టీచర్ మృతి

- మేడిపల్లి జాతీయ రహదారి వద్ద ఘటన



మంగ అలియాస్ వసుంధర (ఫైల్)

ఇబ్రహీంపట్నం : రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ టీచర్ మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తక్కపెల్లి గ్రామానికి చెందిన కొడిమ్యాల మంగ అలియాస్ వసుంధర ఢిల్లీలో ఈనెల 28న పార్లమెంట్, జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో పాల్గొనేందుకు తోటి అంగన్‌వాడీ టీచర్లతో వెళ్లేందుకు సిద్ధమైంది. కుమారుడు తేజతో కలిసి తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై మెట్‌పల్లికి వెళ్తుండగా మేడిపల్లి వద్ద రోడ్డుపై మృతిచెందిన గేదెను ఢీకొన్నారు. వసుంధర అక్కడికక్కడే మృతిచెందింది. తేజకు గాయాలయ్యాయి. మృతురా లికి ముగ్గురు కుమారులు కాగా భర్త వేణు బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉమాసాగర్ పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య పరామర్శించారు. బాధిత కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటంబాన్ని ఆదుకోవాలి..

మెట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అంగన్‌వాడీ టీచర్ మంగ కుటుంబాన్ని ఆదుకోవాలని ఏ ఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు కోరారు. ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



మిట్టపల్లి లక్ష్మణ్ (ఫైల్)

మల్లాపూర్ : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..మల్లాపూర్ మండలం మొగిలిపేటలో గ్రామానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ (35)కు ఏడు సంవత్సరాల క్రితం చిట్టాపూర్‌కు చెందిన కావ్యతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. నెల క్రితం భార్యతో మనస్పర్థలు రావడంతో కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మణ్ ఈనెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్ష్మణ్‌ను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగకు దేహశుద్ధి



స్థానికులకు పట్టుబడిన దొంగ

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి సైకిల్ దొంగతనం చేస్తుండగా స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి సోమవారం మధ్యాహ్నం హనుమాన్‌వాడలో అనుమానాస్పదంగా తిరుగుతూ ఓ ఇంట్లో చొరబడి సైకిల్ ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు అప్పగించారు. నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి కొద్దిరోజులుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆగ్రహం



మున్సిపల్ రివ్యూ సమావేశంలో హాజరైన కౌన్సిలర్, కో ఆప్షన్ల భర్తలు

- కాంగ్రెస్ కౌన్సిలర్లకు అందని రివ్యూ సమావేశ సమాచారం

ధర్మపురి : పట్టణ అభివృద్ధిపై సోమవారం నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా అవమానపర్చారంటూ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల నాగలక్ష్మి మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన పట్టణ అభివృద్ధిపై అధికారిక రివ్యూ సమావేశం ప్రకటన జారీచేశారు. కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కౌన్సిలర్లకు సమావేశం గురించి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేవలం బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లకు మాత్రమే సమాచారం అందించారన్నారు. ముఖ్యంగా కౌన్సిలర్, కో ఆప్షన్లు మహిళలుండగా సమావేశానికి భర్తలను అనుమతించి సమావేశం నిర్వహించడంపై తప్పుబట్టారు.

విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది జైలు

జగిత్యాలజోన్ : విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి ఏడాది జైలుతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి, జిల్లా మొదటి అదనపు జడ్జి వీరయ్య సోమవారం తీర్పుచెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదుగంటి బాలత్రిపుర సుందరి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన 17 ఏళ్ల విద్యార్థిని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. డిసెంబర్ 12, 2016న కళాశాలలో పరీక్ష ఉండగా హాజరైంది. రాత్రి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యంలో అర్ముల్ల రాజేశ్ అనే వ్యక్తికి చెందిన ఆటో కనిపించగా తెలిసిన వ్యక్తి అని ఆటో ఎక్కింది. కొంతదూరం వెళ్లాక విద్యార్థిని పట్ల ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించగా ఆటోలో నుంచి దూకింది. దీంతో తీవ్రగాయాలుకాగా జగిత్యాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేయడంతో ప్రస్తుత డీసీపీ, అప్పటి సీఐ పి. కరుణాకర్ రాజేశ్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు బి.రాజు, జి. మల్లేశ్, కిరణ్‌కుమార్ సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. రాజేశ్‌కు ఏడాది జైలుతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన

మల్యాల(చొప్పదండి):బల్వంతాపూర్‌లో సోమవారం రాత్రి ఎస్పీ భాస్కర్ ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నివారణ, మంత్రాలపై అవగాహన కల్పించారు. ప్రజలను నమ్మించేందుకు దొంగ బాబాలు గాలిలో నుంచి విభూతి తీయడం, బంగారు గొలుసు సృష్టించడం వంటివి అభూత కల్పనలని నిరూపిస్తూ మెజీషియన్లు పావురాన్ని తీయడం వంటి మేజిక్ ట్రిక్కులు ప్రదర్శించారు. ఇవి ఆహూతులను ఆకట్టుకున్నాయి. పోలీసు కళాబృందం పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ ప్రజలను నమ్మించేందుకు దొంగ బాబాలు మంత్రాలు చేసి, శారీరక, మానసిక ఆరోగ్యం కుదుటపరుస్తామని అంటారని, వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎస్పీ ప్రకాశ్, సీఐ రమణమూర్తి, ఎస్సై చిరంజీవి, రిటైర్డ్ ఏఎస్సై మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని బూర్గుపల్లి, బోయినపల్లి గ్రామాల్లో సోమవారం పిచ్చికుక్కల దాడిలో ఇద్దరు మహిళలతో పాటు ఓ బాలుడు గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుపల్లి గ్రామానికి చెందిన కొలుపుల మంజుల (40) ఉదయం ఇంటి ముందు నిల్చుండగా ఆమెపై పిచ్చికుక్క దాడిచేసింది. కాగా చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బోయినపల్లిలో ఓ ఇంట్లో జరిగిన శుభకార్యానికి పలువురు బంధువులు హాజరయ్యారు. సోమవారం తిరుగుపయనమవుతుండగా భీవండికి చెందిన కుసుమ లక్ష్మి (50), కరీంనగర్ జిల్లా ఎలగందుల గ్రామానికి చెందిన చరణ్ తేజ్ (5)పై పిచ్చికుక్కలు దాడిచేయగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి బోయినపల్లి పీహెచ్‌సీలో చికిత్స అందించారు.